క్లుప్తంగా

యువజన సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో తాడిగడప డొంక రోడ్డు మహాత్మాగాంధీ కాలనీ, ఇందిరానగర్ రావిచెట్టు సెంటర్‌లో మంగళవారం సంక్రాంతి క్రీడలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, మహిళా సంఘాలు, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. మహిళా సంఘ నాయకురాలు అనిత ఆటల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. లెమన్ అండ్ స్పూన్, స్లో సైకిలింగ్, బకెట్ బాల్, మోకు లాగుడు, ముగ్గుల పోటీ, మ్యూజికల్ చైర్స్, పలు ఆటల పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించారు. విజేతలకు వీఎల్ భవన్‌లో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం , నేతలు షేక్.బాబు, పల్ల చినపాపారావు, లావు మాధవరావు, పలువురు పాల్గొన్నారు.

పేకాట వద్ద ఘర్షణ : ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: ఇందుపల్లిలో సోమవారం అర్ధరాత్రి పేకాట శిబిరం వద్ద జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పేకాట వద్ద రేగిన వివాదంలో అనగాని నాగబాబు కూరగాయలు కోసే చాకుతో చెరుకుమల్లి కిశోర్, మధులపై దాడి చేశాడు. ఈ దాడిలో కిశోర్, మధు గాయపడటంతో ఆగ్రహించిన కిశోర్ వర్గం నాగబాబు ఇంటి పైకి వెళ్లి రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో నాగబాబు తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కిశోర్, మధులకు చేతులు, ముఖంపై గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇరు వర్గాలు పరస్పరం ఇచ్చిన ఫిర్యాదులతో ఎస్ఐ యు.గోవింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎంఈఎఫ్ నేతలు



గన్నవరం: ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని గన్నవరం నియోజకవర్గానికి చెందిన మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు దేవరపల్లి ఏసుబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాదిగ ఉద్యోగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. మాదిగ జాతి అభ్యున్నతికి కార్పొరేషన్ ద్వారా సహాయ, సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఎంఈఎఫ్ నేతలు పులపాక యేసురత్నం, నిమ్మకూరి కోటేశ్వరరావు, దేవరపల్లి రాబర్ట్ జాన్సన్ పాల్గొన్నట్లు వివరించారు.

హంసలదీవి సాగరతీరంలో సందడి



కోడూరు: హంసలదీవి సాగరతీరానికి సంక్రాంతి పండుగ శోభ సంతరించుకుంది. పండుగకు స్వగ్రామాలకు తరలివచ్చిన ప్రజలు కూడా తీరానికి తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడకు చెందిన పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో వచ్చి తీరంలోని ఇసుకతిన్నెలపై సరదాగా గడిపారు. సముద్రంలోని అలల మధ్య కేరింతలు కొట్టారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్‌లతో సందడి చేశారు. తిరుగు ప్రయాణంలో పర్యాటకులు ఉల్లిపాలెం వద్ద ఏర్పాటు చేసిన 27 అడుగుల తెలుగుతల్లి విగ్రహం వద్ద ఆగి సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీ చేపట్టారు.

మహిళా ఉత్సవ్‌లో స్టాల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులకు విక్రయించేందుకు ఫిబ్రవరి 8 నుంచి 16వ తేది వరకు మొగల్రాజపురంలోని మొగల్ హాలులో మహిళా ఉత్సవ్-2025ను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందిన వారు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మాత్రమే ఈ మహిళా ఉత్సవ్‌లో ప్రదర్శించి విక్రయించుకోవచ్చునని పేర్కొన్నారు. వ్యాపార మెలకువలు నేర్చుకోవడంతో పాటుగా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి ఈ మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేస్తుందని చెప్పారు. మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోడానికి చక్కటి వేదిక అని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోగా మొగల్రాజపురంలోని రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

సంక్రాంతి 'కోట్లాట'

- యథేచ్ఛగా కోడిపందేలు, జూదం
- సంక్రాంతి సంబరాల మాటున బరి తెగింపు
- అక్రమంగా మద్యం విక్రయాలు
- కన్నెత్తి చూడని యంత్రాంగం

కంకిపాడు: సంక్రాంతికి కోట్లాట జరిగింది. పందెం కోళ్లు జూలు విదిల్చాయి. పందెం రాయుళ్లు, జూదరులు బరిలో కోట్లు, లక్షలు చేతులు మార్చుకున్నారు. సంక్రాంతి సంబరాల పేరుతో తెలుగు తమ్ముళ్లు, కూటమి నేతలు బరి తెగించి అడ్డగోలుగా పందేలు జరిపించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కంకిపాడులో రెండు చోట్ల, గొడవర్రు, ఉప్పలూరు, ఈడుపుగల్లు గ్రామాల్లో కోడిపందేల శిబిరాలు ఏర్పాటుచేశారు. కోడి పందేలతో పాటుగా కోతముక్క, 13 ముక్కల ఆట, గుండాట, డబ్బా కొట్టుడు, ఇతర జూద క్రీడలు నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ పందేలు సాగాయి. సంబరాల మాటున జూద క్రీడలు యథేచ్ఛగా జరిపించారు. బరుల్లో మూడు రోజుల పాటు మద్యం అక్రమ అమ్మకాలు అడ్డగోలుగా సాగాయి. క్వార్టర్ బాటిల్‌కు రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూలు చేశారు. ఇదే సమయంలో తినుబండారాల విక్రయాల్లోనూ అధిక ధరలకు విక్రయాలు జరిపి సొమ్ము చేసుకున్నారు. బరుల్లో పర్యవేక్షణ కొరవడటంతో నిత్యం ఘర్షణలు చోటుచేసుకున్నాయి. గ్రూపులుగా ఏర్పడి వాగ్వాదం, ఘర్షణలకు పాల్పడ్డారు. మండలంలోని రెండు బరుల్లో తోపులాటలు, దాడులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనపై పోలీసు అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

చేతులు మారిన రూ.వందల కోట్లు

మూడు రోజుల పాటు ఒక్కో కోడి పందేల బరిలో రూ.20 కోట్లు పందేల రూపంలోనూ, పై పందేల రూపంలో రూ.50 కోట్ల మేరకు చేతులు మారినట్లు అంచనా. సంక్రాంతి బరి పేరుతో కోట్లాట జరిగిందని పలువురు పందెంరాయుళ్లు వ్యాఖ్యానిస్తున్నారు.



కంకిపాడు బైపాస్ వెంబడి కోడిపందేల బరి

జోరుగా కోడిపందేలు, పేకాట శిబిరాలు

గన్నవరం: సంక్రాంతి పండుగ పేరుతో నియోజకవర్గ వ్యాప్తంగా కోడి పందేలు, పేకాట శిబిరాలు యథేచ్ఛగా నడి... చాయి. కూటమి ప్రభుత్వ... నేతలు ఎక్క...డికక్కడ బహిరంగంగా జూద శిబిరాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. రామవరప్పాడు, ఎనికేపాడు, సూరంపల్లి, అంపాపురంలో భారీ స్థాయిలో ఏర్పాటైన శిబిరాల్లో పందేల రూపంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఈ స్థాయిలో జూద శిబిరాలు జరుగుతున్నా పోలీసులు ఎక్కడా అడ్డుకునే ధైర్యం చేయలేదు. గన్నవరం మండలం సూరంపల్లిలో ఏర్పాటు చేసిన శిబిరంలో మూడు రోజులుగా పెద్ద ఎత్తున కోడి పందేలు జరిగాయి. పక్కనే ఏసీ టెంట్‌లు ఏర్పాటు చేసి పేకాట, కేసినో వంటి జూద క్రీడలు నిర్వహించారు. వీటి వద్ద బౌన్సర్లను ఏర్పాటు చేసి ఎంట్రీ ట్యాగ్‌లు కొనుగోలు చేసిన వారినే లోపలికి అనుమతించారు. మర్లపాలెంలో ఎన్‌హెచ్ బైపాస్ పక్కనే తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో కోడిపందేలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న చెంచుల కాలనీలో భారీగా కోడిపందేలు నిర్వహించడం గమనార్హం. వీఎన్ పురం కాలనీలో రోడ్డు పక్కనే కోడిపందేలు, పేకాట శిబిరం బహిరంగంగా జరిగాయి.



సూరంపల్లి బరిలో పోటీపడుతున్న కోడి పుంజులు



కంకిపాడు బైపాస్ మార్గంలో జనసేన ఏర్పాటు చేసిన బరిలో పందేలు వీక్షిస్తున్న ప్రజలు



కంకిపాడు బరిలో తలపడుతున్న కోళ్లు



ఉప్పలూరు కోడిపందేల బరిలో పందేలు వీక్షిస్తున్న ప్రజలు

బరితెగించిన కూటమి నేతలు

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు, ఉంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి ముసుగులో జోరుగా జూదం కొనసాగింది. ఉంగుటూరు స్టేషన్ పరిధిలో గన్నవరం-గుడివాడ ప్రధాన రహదారిలో ఉంగుటూరు, కొయ్యగూరపాడులో జగనన్న కాలనీలో జూద శిబిరాలు నిర్వహించారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తెంపల్లి, చిన్న అవుటపల్లి గ్రామాల్లో జూద శిబిరాల్లో చిన్న బజార్-పెద్ద బజార్, కోత ముక్క, కోడి పందాలు, లోనా బయటా వంటి జూదాలతో పాటు మద్యం ఏరులైపారింది. పోలీసులకు లక్షల రూపాయలు ఇస్తేనే అనుమతులు ఇచ్చారని బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

న్యాయస్థానాల ఆదేశాలు బేఖాతరు...

న్యాయస్థానాలను తప్పు దోవ పట్టించేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. సంక్రాంతి సందర్భంగా కత్తులతో కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించకూడదని కోర్టులు ముందే చెప్పాయి. దీంతో పోలీసులు కేసులు చూపించేందుకు గ్రామాల్లో వీధిలైట్ల వద్ద వంద, రెండు వందల రూపాయలకు పేకాట ఆడుకునే వారిపై గురి పెట్టారు. తేలప్రోలు, ఆత్కూరు, పొట్టిపాడు తదితర గ్రామాల్లో ఆత్కూరు పోలీసులు కాలనీల్లో పండగ రోజు వీధిలైటు కింద పేకాట ఆడే వ్యవసాయ కూలీలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఉంగుటూరు పోలీసులు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో కాలనీల్లో పర్యటించి వీధిలైట్ల కింద పేకాట ఆడుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో చూపేందుకు సిద్ధం చేశారు. కూటమి నేతల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రధాన రహదారులకు సమీపంలో బహిరంగంగా భారీ ఎత్తున జూద శిబిరాలు ఏర్పాటు చేసి లక్షల్లో చేతులు మారుతున్న అటువైపు కన్నెత్తి చూడని పోలీసులు వీధిలైట్ల కింద చిన్న మొత్తంలో పేకాట ఆడుతున్న వారిపై కేసులు నమోదు చేయడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

హద్దులు దాటిన జూద క్రీడ

- రూ.లక్షల్లో కోత ముక్క
- రక్తం చిందిన కోడి పందేల బరులు
- జేబులు నింపుకొన్న టీడీపీ నేతలు

పెనమలూరు: యనమలకుదురులో ప్రసిద్ధిగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ రామలింగేశ్వరస్వామి ప్రాంతంలో కూటమి నేతలు పెద్ద ఎత్తున జూద క్రీడలు నిర్వహించారు. రూ.లక్షల్లో కోత ముక్క , గుండాట నిర్వహించారు. ఇక కోడి పందేల బరులు పందెం పుంజుల రక్తంతో తడిసి ముద్దయ్యాయి. రెవెన్యూ, పోలీసులు, మండల టాస్క్‌ఫోర్స్ టీంలు ఎక్కడా కనిపించలేదు. యనమలకుదురు జూద క్రీడల శిబిరంలో కోతముక్క మూడు పువ్వులు..ఆరుకాయలుగా సాగింది. రూ.లక్షలు చేతులు మారాయి.

చేతులు మారిన రూ.లక్షలు

యనమలకుదురులో కోడి పందేలకు పలు బరులు ఏర్పాటు చేశారు. వందలాది కోడి పుంజులు కత్తులకు బలయ్యాయి. రక్తంతో బరులు తడిసిపోయాయి. కోడి పందేల వద్ద ఘర్షణలు జరిగినా పోలీసులు ఎక్కడా కనబడలేదు. మఫ్టీలో పోలీసులు అక్కడక్కడ కనిపించినా చర్యలు తీసుకోలేదు. గత మూడు రోజులపాటు జరిగిన కోడిపందేలలో కూడా రూ.లక్షలు చేతులు మారాయి.

పోలీసులపై విమర్శలు

కోడి పందేలలో ఓడిన పుంజులను పోలీసులు తన్నుకుపోయారని పందెం రాయుళ్లు వాపోతున్నారు. కోడిపందేలలో గెలిచిన వ్యక్తి ఓడిన కోడి పుంజును కైవసం చేసుకుంటాడు. అయితే పోలీసులు బెదిరింపులకు దిగి ఉన్నతాధికారులకు ఇవ్వాలని ఓడిన కోడి పుంజులను తమకు అందకుండా తీసుకువెళ్లారని బాధితులు ఆరోపిస్తున్నారు. పెనమలూరులో కోత ముక్క, కోడి పందేలు జోరుగా సాగాయి.



పెనమలూరు బరిలో పందెం పుంజులు



కాటూరులో నిర్వహిస్తున్న కోడి పందేలు

కాటూరులో జోరుగా కోడిపందేలు

ఉయ్యూరు: సంక్రాంతి సంబరాల పేరుతో తెలుగు తమ్ముళ్లు బరితెగించారు. విచ్చలవిడిగా జూదం, కోడిపందేలకు తెరతీసి లక్షలు కొల్లకొట్టారు. మండలంలోని కాటూరు, ఆకునూరు, బోళ్లపాడు తదితర గ్రామాల్లో బరులు ఏర్పాటుచేసి జూద క్రీడలు నిర్వహించారు. చిన్న బజారు-పెద్ద బజారు, కోతముక్క, స్లైక్, గుండాట, ఇతర జూద క్రీడలు జరిపించారు. జూద క్రీడల మాయలో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నా పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఆకునూరు బరి సమీపంలో మంగళవారం ఘర్షణ చోటుచేసుకుంది. కోడి పందేల బరికి వెళ్లే క్రమంలో కారు, ద్విచక్రవాహనం ఒకదాన్నొకటి ఎదురెదురు కావటంతో యువకుల మధ్య ఘర్షణ తలెత్తి ఓ యువకుడి తలకు బలమైన గాయమైంది.

జోరుగా కోడి పందేలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో గత మూడు రోజులుగా కోడి పందేలు విచ్చలవిడిగా జరిగాయి. రామవరప్పాడు ఫ్లై ఓవర్ సమీపంలో, ఎనికేపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని పొలాల్లో భారీ బరులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఒక పక్క కోడి పందేలు, మరో పక్క జూద శిబిరాల్లో కోట్లల్లో లావాదేవీలు జరిగాయి. రామవరప్పాడు, ఎనికేపాడు బరుల్లో హైటెక్ జూదాలు నడిచాయి. వీఐపీలు, ఎన్ఆర్ఐల కోసం ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎంట్రీ ఫీజు నిర్ణయించి అన్‌లిమిటెడ్ మద్యం, ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేశారు. కోత ముక్క, పెద్ద బజారు చిన్న బజారు, లోపల బయట, గుండాట వంటి జూద శిబిరాలు నిర్వహించారు. రాత్రుళ్లు కూడా జూదాలు నిరాటంకంగా జరిగేందుకు వీలుగా ఫ్లడ్ లైట్లు భారీగా ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ స్క్రీన్లు ఏర్పాటు చేసి లైవ్ టెలికాస్ట్ ఇచ్చారు. ఫోన్ పే, గూగుల్ పే, కార్డు స్వైపింగ్ చేసి కమీషన్ల పద్ధతిలో నగదు చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. వీఐపీ శిబిరంలో అడుగు పెట్టాలంటే రూ.50 వేలు నగదు చూపించి మరో రూ.5 నుంచి 10 వేలు ఎంట్రీ ఫీజు చెల్లిస్తే చేతికి ట్యాగ్ వేస్తున్నారు. కోట్లలో భారీగా జూదాలు జరుగుతున్నా పోలీసులు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.



మద్యం తాగడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం



జూద స్టాళ్ల వద్ద గుమిగూడిన జనం



కార్డ్ స్వైపింగ్, ఫోన్, పే గూగుల్ పే ద్వారా నగదు చెల్లింపులు

ఘనంగా మకరజ్యోతి దర్శనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి మకరజ్యోతి దర్శనం ఘనంగా జరిగింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత, ఆలయ ట్రస్టీ నూలు నరసింహారావు ఆధ్వర్యంలో దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మకరజ్యోతి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మకర జ్యోతి దర్శనానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, డాక్టర్ దుట్టా రామచంద్రరావులకు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. 18 మెట్లపై 18 మంది భక్తులతో 18 కలశాలను ఉంచారు. అనంతరం మకరజ్యోతిని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఏటా నిరాటంకంగా అయ్యప్పస్వామి దేవస్థానంలో మకరజ్యోతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నూలు నరసింహారావును అభినందించారు. గన్నవరం ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, జనసేన నేత చలమలశెట్టి రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, వేగిరెడ్డి పాపారావు, బాపులపాడు ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, గ్రామ ప్రముఖులు నండూరి సత్యవెంకటేశ్వర శర్మ, గరికపాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మకరజ్యోతి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ, డాక్టర్ దుట్టా రామచంద్రరావు

వెండి పూర్ణకుంభం బిందె సమర్పణ



స్వామివారికి వెండి బిందె అందజేస్తున్న దాత చాందిని ఫణిసాయి కరిష్మా

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి చల్లపల్లి వాస్తవ్యులు కొల్లు చాందిని ఫణిసాయి కరిష్మా కుటుంబ సభ్యులు 500 గ్రాముల బరువు కలిగిన వెండి పూర్ణకుంభం బిందె సమర్పించుకున్నారు. మంగళవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న అనంతరం సుమారు రూ.55 వేల విలువగల వెండి బిందెను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

గ్రామాల్లో భారీ జూద శిబిరాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సంక్రాంతి సంప్రదాయం ముసుగులో పందెంరాయుళ్లు భారీ జూదానికి తెరలేపారు. బాపులపాడు మండలంలోని అంపాపురం, వేలేరు, బిళ్లనపల్లి, కె.సీతారామపురం గ్రామాల్లో మూడు రోజుల పాటు తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా భారీ జూదశిబిరాలను నిర్వహించారు. పేకాట, కోడి పందేలు, కోతముక్క, లోనాబయట, కాయ్ రాజా కాయ్, గుండాట, నంబర్ గేమ్ సహా పలురకాల జూదక్రీడలను ఈ శిబిరాల్లో రేయింబగళ్లు ఇష్టారాజ్యంగా నిర్వహించారు. జూదప్రియులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల హంగులతో భారీగా బరులు సిద్ధం చేశారు. అంపాపురం బరిలో కోడి పందేలను తిలకించేందుకు వీఐపీ, జనరల్ గ్యాలరీలు, ఎల్ఈడీ స్క్రీన్‌లు సైతం ఏర్పాటు చేశారు. పొరుగు జిల్లాల నుంచి జూదగాళ్లు తరలిరావటంతో ఈ శిబిరాలు తిరునాళ్లను తలపించాయి. అంపాపురంలో ఒక్కో శిబిరంలో దాదాపు 10 పేకాట కోసులు, మరో 10 గుండాట శిబిరాలు ఏర్పాటు చేశారు. కోడి పందేల నిర్వహణకు వేర్వేరు బరులు సిద్ధం చేశారు. పందెం మొత్తాన్ని బట్టి బరులను నిర్ణయించారు. ప్రధాన బరిలో ఒక్కో పందెం విలువ రూ.10 లక్షల పైమాటే. ఈ జూద శిబిరాల్లో క్షణాల వ్యవధిలోనే రూ.కోట్ల రూపాయలు చేతులు మారిపోయాయి. దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జూదశిబిరం ప్రాంగణంలోనే బిర్యానీ, చికెన్ పకోడి, గుట్కా, మద్యం, శీతల పానీయాల దుకాణాలను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు అత్యధిక కోడి పందేలు గెల్చిన విజేతలకు అంపాపురం బరి నిర్వాహకులు మూడు బుల్లెట్ బైక్‌లను బహుమతులుగా అందించారు. బిళ్లనపల్లి బరిలోనూ చివరిరోజున అత్యధిక కోడి పందేలు గెల్చిన విజేతకు కూడా బుల్లెట్ బైక్‌ను బహూకరించారు.



బిళ్లనపల్లి బరిలో అత్యధిక కోడి పందేలు గెల్చిన విజేతకు బుల్లెట్ బైక్‌ను అందిస్తున్న నిర్వాహకులు

పేరంటాలమ్మ ఆలయంలో ఘనంగా మకర సంక్రాంతి

రామవరప్పాడు: రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 4 గంటల నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విఘ్నేశ్వర పూజతో ఆలయంలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పుణ్యాహవాచనం, కుంకుమ పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక మాట్లాడుతూ సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి భక్తులు విశేషంగా ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారన్నారు. ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కనుల పండువగా గ్రామోత్సవం

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ముగ్గురమ్మలతో జరుగుతున్న గ్రామోత్సవం కనులపండువగా జరుగుతుంది. అమ్మవార్ల గ్రామోత్సవం కనులారా వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత పేరంటాలమ్మ ఆలయం నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం ప్రారంభమైంది. రథాన్ని భక్తులు అనుసరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18న సాయంత్రం పేరంటాలమ్మ గ్రామోత్సవాన్ని పూర్తి చేసుకోనుంది. అదే రోజు రాత్రి వంతెన సెంటర్‌లో ఉన్న రైవస్ కాలువలో అమ్మవార్ల తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.



ఆలయంలో ముగ్గురమ్మలు



కనుల పండువగా గ్రామోత్సవం

నున్నలో భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని దేవదాయ శాఖకు చెందిన వివిధ దేవాలయాల్లో సంక్రాంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.పురాతన దేవాలయాలైన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, గోదాదేవిలను గరుడ వాహనం పైన, శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామిని శేషవాహనం పైన పురవీధులలో ఊరేగించారు. ప్రధానంగా దేవాలయం దగ్గర నుంచి చెరువు సెంటర్, దుర్గగుడి ,హైస్కూల్‌రోడ్డు లోని రంగా దిమ్మ సెంటర్, యాలాల వీధి, కాలేజ్ రోడ్, యాదవుల బజార్, లోయబాట, కోటకట్ట సెంటర్ నుంచి బ్రాహ్మణవీధుల్లో ట్రాక్టర్లపై, పల్లకిపై ఊరేగింపు కొనసాగింది. భక్తులు ప్రతి ఇంటి ముందు వారు (నీరు)పోసి, కొత్త బియ్యం, బెల్లం, ఫలాలు, ధూప, దీపాలు, హారతులు పట్టారు. గ్రామోత్సవం అనంతరం భక్తులు త్రిశూల, చక్రస్నానాలను ఆచరించారు. అర్చక స్వాములు డాక్టర్ మామిళ్ళపల్లి ఫణికుమార్, రొంపిచర్ల దత్తకుమార్, కేఎస్ రామకృష్ణ, రుత్విక్ బృందం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు తగు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి



శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు



కప్తానుపాలెం(మోపిదేవి): పెదప్రోలు శివారు కప్తానుపాలెం వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం రాత్రి పెదప్రోలు నుంచి కె.రాజేష్ ద్విచక్ర వాహనంపై చల్లపల్లి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతివేగంతో ఢీ కొనడంతో ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం పక్కన వెళ్తున్న మరో ద్విచక్ర వాహనంపై పడటంతో దానిపై ప్రయాణిస్తున్న శివరామపురానికి చెందిన వి.శివ ప్రసాద్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం ముందు చక్రం ఊడిపోయి దూరంగా పడిపోవడంతో కారు వేగాన్ని గుర్తించవచ్చు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రాజేష్‌ను విజయవాడ ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిసింది. ఈ ప్రమాదంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.